సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

I

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



వేతనదారులకు పని కల్పించండి

ఉపాధిహామీ పథకంలో వేతనదారులకు పని కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఎంపీడీవోలను ఆదేశించారు. IIలో



శరవేగంగా పునరుద్ధరణ పనులు

కేకే లైన్‌లో ట్రాక్ పునరుద్ధరణ పనులను ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ పరిశీలించారు. IIలో



పరుగుపోటీల్లో విద్యార్థి ప్రతిభ

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సింహచలం నాయుడు ప్రతిభ కనబరిచాడు. IIలో

మన్యానికి మరింత వన్నె..

ఉమ్మడి విశాఖ జిల్లాలో మన్యం ప్రాంతానికి పర్యాటకంగా ఎంతో విశిష్టత ఉంది. సహజ సిద్ధ అందాలకు నెలవైన ఈ ప్రాంతానికి దేశవిదేశాలనుంచి పర్యాటకులు వస్తుంటారు. పునర్విభజన అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లాగా ఏర్పడటంతో పర్యాటకంగా మరింత ప్రాధాన్యం పెరిగింది. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పర్యాటక రంగానికి కావల్సిన వనరులు ఉన్నందున పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.



పిట్టలబొర్ర జలపాతం



వంజంగి హిల్స్‌పై కనువిందు చేస్తున్న ప్రకృతి అందాలు

- పర్యాటకంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి
- పర్యాటకులకు అనువుగా సౌకర్యాలు
- ప్రత్యేక నిధులు వెచ్చించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఐటీడీఏ చొరవతో మరిన్ని సౌకర్యాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

సాక్షి,పాడేరు: ఒకపక్క దట్టమైన అటవీ ప్రాంతం.. మరోపక్క గోదావరిలో పాపికొండల విహారం.. ఎటు చూసినా జలపాతాలు.. ఎత్తయిన గిరి శిఖరాలు.. మన్యం సొంతం. పునర్విభజన అనంతరం 22 మండలాలతో జిల్లాగా ఆవిర్భవించడంతో పర్యాటకంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీనిలో భాగంగానే పాడేరు, రంపచోడవరం ఐటీడీఏలతోపాటు పర్యాటకశాఖ, అటవీశాఖలు కీలక ప్రాజెక్ట్‌లను అందుబాటులోకి తెచ్చాయి. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చర్యలు చేపట్టాయి.

లంబసింగిలో రూ.50 కోట్లతో స్వదేశ్ దర్శన్ ప్రాజెక్ట్

లంబసింగిలో స్వదేశ్‌దర్శన్ పర్యాటక ప్రాజెక్ట్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పర్యాటకశాఖ ప్రతిపాదనలు పంపింది.

ఐటీడీఏ ఆధ్వర్యంలో..

- రూ.31లక్షలతో లంబసింగిలో ఐదు కాటేజీలను నిర్మిస్తున్నారు. ఫుడ్ కోర్టు నిర్మాణం జరుగుతోంది.
- చెరువులవేనంలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న వ్యూపాయింట్ పర్యాటక సీజన్ నాటికి అందుబాటులోకి రానుంది. ఐటీడీఏ రూ.32 లక్షలతో రోడ్డు నిర్మాణం, పర్యాటకులకు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టింది.
- తాజంగిలో పర్యాటకులకు పూర్తిస్థాయిలో వినోద క్రీడలు అందుబాటులోకి తెచ్చింది. ఇందుకుగాను రూ.6లక్షలతో బోటు షికారు, జిప్‌లైనర్ ఏర్పాటుచేసింది. ఇదే ప్రాంతంలో కాటేజీల నిర్మాణానికి సంకల్పించింది.
- కొత్తపల్లి జలపాతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది. మరో రూ.10 లక్షలతో మౌలిక వసతులు కల్పిస్తోంది.
- మేఘాల కొండ వంజంగి హిల్స్‌పై రూ.78 లక్షలతో మౌలిక వసతుల కల్పిస్తోంది. దీనిలో భాగంగా ఎకో టూరిజంలో కాటేజీల నిర్మాణం చేపట్టే ఆలోచనలో అటవీశాఖ ఉంది.
- పెదబయలు మండలంలో అత్యంత ఎత్తులో ఉన్న ఎండ్రిక్ పర్వతం, హుకుంపేట మండలం సీతమ్మ కొండ ప్రాంతాల అభివృద్ధిపై కూడా పాడేరు ఐటీడీఏ దృష్టి సారించింది. కొండ ప్రాంతం వరకు రోడ్ల నిర్మాణం.. పర్యాటకులకు అనువైన వసతి కల్పించేందుకు కసరత్తు మొదలు పెట్టింది.
- ముంచంగిపుట్టు మండలం సుజనకోటలో పంచాయతీలో విస్తరించి ఉన్న మత్స్యగెడ్డ పరిసరాలకు పర్యాటకంగా మంచి గుర్తింపు ఉంది. ఈ ప్రాంతాలు దీవులను తలపించేలా ఉన్నందున ఇక్కడి వచ్చేందుకు పర్యాటకులు ఆసక్తి చూపిస్తుంటారు. ఈప్రాంతంలో సినిమా షూటింగ్‌లు జరుగుతుంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని అటవీ పర్యాటకంలో భాగంగా రూ.35 లక్షలతో పర్యాటకులకు అనువుగా వసతులు కల్పించేందుకు కసరత్తు జరుగుతోంది.

తలమానికంగా..

జిల్లాకు తలమానికంగా నిలిచేలా అరకు గిరిజన మ్యూజియాన్ని సుమారు రూ.కోటిన్నరతో పాడేరు ఐటీడీఏ అభివృద్ధి చేసింది. ఇక్కడి గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టేలారూపొందించిన ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇక్కడ కూడా వినోద క్రీడలు అందుబాటులో ఉన్నాయి. దీనిపై వచ్చే ఆదాయాన్ని మ్యూజియం అభివృద్ధికి ఐటీడీఏ వెచ్చిస్తోంది.

- చాపరాయి జలపాతం వద్ద రూ.25లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించారు. పూలమొక్కలతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ కూడా వినోద క్రీడలు అందబాటులో తెచ్చేందుకు రూ.48లక్షలతో ప్రణాళిక సిద్ధం చేశారు.
- కొత్తవలస హెచ్‌ఎస్‌టీసీలో రూ.78లక్షలతో కాటేజీలు నిర్మాణం, ఔషధ మొక్కల క్షేత్రం పనులు జరుగుతున్నాయి.
- పద్మాపురం గార్డెన్‌లో రూ.70 లక్షలతో మూడు అధునాతన ట్రీహట్స్ నిర్మించారు. ఇవి త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.
- కటికి జలపాతం వద్ద రూ.10 లక్షలతో మౌలిక వసతులు కల్పించి మరుగుదొడ్లు నిర్మించారు.
- అటవీశాఖకు చెందిన అంజోడ సిల్క్‌ఫారం కొద్ది రోజుల్లో పర్యాటకులకు అందుబాటులోకి రానుంది. ఇక్కడ రూ.27 లక్షలతో కాటేజీలు, రోజ్ గార్డెన్ ఏర్పాటుపనులు చురుగ్గా జరుగుతున్నాయి.
- తాజంగిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వాతంత్య్ర సమయోధుల మ్యూజియం వచ్చే ఏడాది పర్యాటక సీజన్ నాటికి అందుబాటులోకి తెచ్చేలా పనులు జరుగుతున్నాయి.
- బొర్రాగుహల వద్ద త్వరలో సాహస క్రీడలు అందుబాటులోకి రానున్నాయి.



బొర్రా గుహలు

పూర్తిస్థాయిలో లంబసింగి అభివృద్ధి



లంబసింగిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఉన్నాం. దీనిలో భాగంగా స్వదేశ్‌దర్శన్ పర్యాటక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వానికి రూ.50 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ఈ ప్రాజెక్టు మంజూరైతే లంబసింగి పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి.

– దాసు, జిల్లా పర్యాటకశాఖ అధికారి, పాడేరు

గిరి యువతకు ఉపాధి



పర్యాటకంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. అటవీ పర్యాటకంలో భాగంగా సీతమ్మకొండ, చెరువులవేనం, వంజంగి హిల్స్‌లో సౌకర్యాలను కల్పిస్తున్నాం రోడ్లతోపాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాపరంగా చర్యలు తీసుకుంటున్నాం.

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో, పాడేరు

న్యూస్‌రీల్

నేడు పెదబయలులో జగనన్నకు చెబుదాం

సాక్షి,పాడేరు/పెదబయలు: పెదబయలు మండల పరిషత్ సమావేశమందిరంలో బుధవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2వరకు జరుగుతుందని,అన్నిశాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు.ప్రజలు ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మధ్యాహ్నం అధికారులు గ్రామసచివాలయాలను సందర్శించి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

నేడు ఐటీడీఏలో పీఎఫ్ అదాలత్

సాక్షి,పాడేరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు భవిష్యనిధి ఆధ్వర్యంలో బుధవారం పాడేరు ఐటీడీఏలో పీఎఫ్ అదాలత్ నిర్వహిస్తున్నామని విశాఖ రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నోడల్ అధికారి కె.వి.కృష్ణమోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ,ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు,కార్మికులు ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ అదాలత్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.ఉదయం 10 గంటల నుంచి పీఎఫ్ అదాలత్ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

రింతాడ హెచ్‌ఎం, డిప్యూటీ మేట్రిన్‌కు షోకాజ్ నోటీసు

- గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు

గూడెంకొత్తవీధి: రింతాడ బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం పాటి పుల్లయ్య, డిప్యూటీ మేట్రిన్ సునితకు గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు మంగళవారం షోకాజ్ నోటీసులిచ్చారు. ఇదే ఆశ్రమ పాఠశాలలో కొద్ది రోజుల క్రితం తాగునీరు లేదని బాలికలు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేశారు. ఈ సమస్యను ముందుగా అధికారులకు చెప్పకపోవడంపై డీడీ ఆగ్రహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, సిబ్బందిని విచారించారు. ఈ విషయంలో హెచ్‌ఎం, డిప్యూటీ మేట్రిన్ నిర్లక్ష్యాన్ని గుర్తించిన డీడీ వారిద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. సంజాయిషి సంతృప్తికరంగా లేకుంటే తదుపరి చర్యలు కలెక్టర్ ఆదేశాల మేరకు తీసుకుంటామని చెప్పారు.

తోటపల్లి వాగులో రైతు గల్లంతు?

- కుటుంబ సభ్యుల అనుమానం
- గాలింపు ముమ్మరం



వాగులో పడవపై గాలింపు

ఎటపాక: మండలంలోని తోటపల్లి వాగులో గన్నవరం గ్రామానికి చెందిన ఒక రైతు గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన కర్రి సత్యనారాయణ(60) సోమవారం పశువులు మేపేందుకు తోటపల్లి వాగు అవతలికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో సాయంత్రం గోదావరికి వరద పెరగడంతో తోటపల్లి వాగులోకి నీరు పోటెత్తింది. పశువులు మేపేందుకు వెళ్లిన సత్యనారాయణ చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వాగు పరివాహక ప్రాంతాల్లో వెతికారు. పశువులు మాత్రమే రాత్రి 10 గంటలకు ఇంటికి చేరాయి. దీంతో పశువులతోపాటు సత్యనారాయణ వాగు దాటే క్రమంలో గల్లంతై ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మంగళవారం ఉదయం కూడా పడవలు, ఈతగాళ్లతో వరద నీటిలో గాలించినప్పటికీ ఎటువంటి లభ్యం కాలేదు.

జగ్గంపాలెం సర్వేయర్ ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలించిన సహోద్యోగులు

గంగవరం: మండలంలోని జగ్గంపాలెం గ్రామ సచివాలయంలో సర్వేయరుగా విధులు నిర్వహిస్తున్న ఇ.నాగార్జున మంగళవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గోకవరం మండల రామన్నపాలెం గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. అంతకుమందు అయన ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సహోద్యోగులకు చెప్పడంతో వారు అప్రమత్తమయ్యారు. లొకేషన్ తెలుసుకుని వెంటనే అక్కడికి చేరుకుని ప్రాణాపాయం నుంచి కాపాడారు. అప్పటికే చేతిని బ్లేడ్‌తో కోసుకోవడంతో రక్తస్రావంతో ఉన్నాడు. వెంటనే అతనిని సహోద్యోగులు గోకవరం పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల వేధింపులు, వృత్తిపరమైన ఒత్తిడి తదితర సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సర్వేయర్ నాగార్జున తమకు వాట్సాప్‌లో పంపినట్టు సహోద్యోగులు తెలిపారు.

అరకు హరిత వ్యాలీ రిసార్ట్‌కు ఉత్తమ అవార్డు



అరకు హరిత వ్యాలీ రిసార్ట్

దొండపర్తి (విశాఖ): పర్యాటకంలో విశాఖకు అవార్డుల పంట పండింది. రాష్ట్ర వార్షిక టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డులను వివిధ కేటగిరీల కింద విశాఖలో ఉన్న హోటళ్లు, రిసార్టులు, రెస్టారెంట్లు, ట్రావెల్ సంస్థలు సొంతం చేసుకున్నాయి. బెస్ట్ 5 స్టార్ హోటల్‌గా రాడిసన్ బ్లూ అవార్డును దక్కించుకుంది. అలాగే 4 స్టార్ విభాగంలో హోటల్ దసపల్లా, బెస్ట్ బడ్జెట్ హోటల్‌గా ఎలిగంట్ హోటల్, బెస్ట్ హరితా హోటల్‌గా అరకు హరిత వ్యాలీ రిసార్ట్, బెస్ట్ హోటల్ బేస్ట్ మీటింగ్ వెన్యూగా వరుణ్‌బీచ్ నోవోటెల్, బెస్ట్ రెస్టారెంట్ ఇన్ హోటల్‌గా గ్రీన్‌పార్క్‌లో మెకాంగ్ రెస్టారెంట్, బెస్ట్ స్టాండ్-అలోన్ రెస్టారెంట్‌గా టైకూన్ అండ్ హెరిటేజ్ రెస్టారెంట్, బెస్ట్ స్టాండ్ అలోన్ కన్వెన్షన్ సెంటర్‌గా వైజాగ్ కన్వెన్షన్స్ అవార్డును సొంతం చేసుకున్నాయి. అలాగే బెస్ట్ ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్(డొమస్టిక్)గా ట్రావెల్ హోం, బెస్ట్ ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్‌గా ట్రావెల్ ఐక్యూ గ్లోబల్ సొల్యూషన్స్, మోస్ట్ ఇన్నోవేటివ్ ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్‌గా హాలిడే వరల్డ్, బెస్ట్ టూరిజం ప్రమోషన్ కొల్లాటిరల్ పబ్లిసిటీ మెటీరియల్‌గా విశాఖపట్నం పాకెట్ టూరిస్ట్ గైడ్, మోస్ట్ ఇన్నోవేటివ్ యూజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/బెస్ట్ టూరిజం వెబ్‌సైట్‌గా యో వైజాగ్‌కు అవార్డులు లభించాయి.

జెండా కొండపై సందడి



సీతమ్మపర్వతం (జెండా కొండ) కనువిందు చేస్తున్న మంచు అందాలు



జెండాకొండపై ప్రకృతి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

తరలివచ్చిన పర్యాటకులు

హుకుంపేట: రాష్ట్రంలో అత్యంత ఎత్తయిన శిఖరం గుర్తింపు పొందిన సీతమ్మపర్వతం (జెండాకొండ) మంగళవారం పర్యాటకులు సందడి చేశారు. సోమవారం రాత్రి కొండ దిగువనున్న ఒలుబెడ్డా గ్రామానికి వెళ్లి అక్కడ నుంచి వేకువజామున కొండపైకి చేరుకున్నారు. పాలసముద్రాన్ని తలపించేలా మంచు అందాలు, సూర్యోదయాన్ని తిలకించారు. కొద్దిరోజులుగా వాతావరణం చల్లగా ఉంటోంది. ఈ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున మంచు ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఈ ఏడాది నెలరోజుల ముందుగానే పర్యాటక సీజన్ మొదలు కానుంది.

సమగ్ర సమాచారంతో హెల్త్ ప్రొఫైల్

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- దిగుమోదాపుట్టులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం విజయవంతం



అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజన బాలుడును ఆత్మీయంగా హత్తుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో వచ్చే ఒకటో తేదీ నుంచి జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రజల ఆరోగ్య సమాచారం (హెల్త్ ప్రొఫైల్) సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టుగా మండలంలోని దిగుమోదాపుట్టు ఆశ్రమ పాఠశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రోగులకు బీపీ, సుగర్,ఇతర పరీక్షలతో పాటు వైద్య నిపుణులు అందిస్తున్న సేవలను ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. మందులు వినియోగం,పౌష్టికాహారం ఆవశ్యకతపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అన్ని వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించిన తరువాత వారికి అందించే వైద్యసేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రోగులు సక్రమంగా మందులు వినియోగించేలా ఆశా కార్యకర్తలను అప్రమత్తం చేయాలన్నారు. వ్యాధి నిర్ధారణను బట్టి రోగుల ప్రొఫైల్ తయారు చేయడమే కాకుండా వైద్యనిపుణులను మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు

చలించిన కలెక్టర్

మానసిక ఎదుగుదల లేక తరచూ ఫిట్స్‌తో బాధపడుతున్న రోహిత్ అనే నాలుగేళ్ల బాలుడు అనారోగ్య పరిస్థితిపై కలెక్టర్ చలించారు. ఆ బాలుడుని తల్లి ఒడి నుంచి తీసుకుని ఆత్మీయంగా హత్తుకుని ఎత్తుకున్నారు. బాలుడికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. బాలుడికి పింఛన్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధిక బీపీతో బాధపడుతున్న గిరిజనుడికి ఆయన రెండు నెలలకు సంబంధించిన మందులను పంపిణీ చేశారు. నెలలకు సరిపడే మందులను అందజేశారు. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు.

300 మందికి వైద్యసేవలు

తుంపాడ సచివాలయం పరిధిలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 300 మంది గిరిజనులు ఈశిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రమేష్‌బాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాష, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, డీఎల్‌డీవో శాంతికుమారి, సీడీపీవో ఝాన్సీరాణి, ఏటీడబ్ల్యూవో రజని, సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు, ఎంపీటీసీ నరసింహమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, డైరెక్టర్ రాజారావు పాల్గొన్నారు.



గిరి మహిళ కంటిని పరీక్షిస్తున్న ఈఎన్‌టీ వైద్యుడు



గిరిజనులకు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



వైద్యశిబిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులను చూపిస్తున్న గిరిజనులు

అర్హులందరికీ జాబ్‌కార్డులు

పీఎంయూ ప్రాజెక్ట్ అధికారి శ్రీరాంగోపాల్



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ అధికారి శ్రీరాం గోపాల్

చింతపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అర్హులైన వారందరికీ జాబ్‌కార్డులు తప్పనిసరిగా పంపిణీ చేయాలని పీఎంయూ ప్రాజెక్ట్ అధికారి శ్రీరాం గోపాల్ ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆశాజ్యోతి అధ్యతన ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. వంద రోజుల పని కల్పించడంతో పాటు పనులు చేసిన వారికి సకాలంలో బిల్లుల చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులపై సంబంధింత అధికారుల పర్యవేక్షణ పూర్తి స్థాయిలో ఉండాలన్నారు. ఏపీవో కొక్కుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు వివిధ పోటీల్లో క్రీడాకారుల ఎంపిక

అగనంపూడి (విశాఖ): విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నీకాయిట్, బాల్ బాడ్మింటన్ అండర్ 14, 17 (బాలురు, బాలికల) విభాగాల్లో పోటీలు, ఎంపికలు బుధవారం నిర్వహించనున్నట్టు విశాఖ, అనకాపల్లి జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు టి.నాగేశ్వరరావు, ఎంవీ నాగేశ్వరరావు తెలిపారు. టెన్నీకాయిట్ పోటీలు, ఎంపికలు పరవాడ మండలం పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బాల్ బాడ్మింటన్ పోటీలు, ఎంపికలు యలమంచిలి కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు వారు తెలిపారు.

నేడు ఏయూలో ఇంటర్న్‌షిప్ డ్రైవ్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం ఇంటర్న్‌షిప్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు. మ్యాక్స్ రిటైల్ డివిజన్-లైఫ్‌స్టైల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 40 మంది ఇంటర్న్‌షిప్ ట్రైనీల కోసం డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఏదైనా డిగ్రీ చదువుతున్న వారు, బీబీఏ, ఎంబీఏ చదువుతున్న వారు అర్హులు. ఆసక్తి, అర్హత కలిగిన వారు https:// www. ncs. gov. in/ లో పేర్లు నమోదు చేసుకుని.. ఉదయం 10.30 గంటలకు ఏయూ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో కార్యాలయంలో జరిగే డ్రైవ్‌కు హాజరుకావచ్చు. ఎంపికైన విద్యార్థులకు స్టైఫండ్‌తో పాటు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ అందజేస్తారు. పూర్తి వివరాలకు 90322 27630, 96660 92491ను సంప్రదించవచ్చు.

29న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 29న శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. ఫ్లిప్‌కార్ట్, వరుణ్ మోటార్స్, సుస్వాదీప్ ఆగ్రో సర్వీసెస్, ఫైనీర్ ఎలాస్టిక్, రవి రేస్(ఇండియన్ ఆయిల్ డీలర్స్), పేటీఎం సర్వీసెస్, రిలయన్స్ ట్రెండ్స్, ముత్తూట్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో 616 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ఈ కంపెనీల్లో ఫ్లోర్ అసోసియేట్, వ్యాన్ డెలివరీ బాయ్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆపరేటింగ్ కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, క్యాషియర్, పిక్కర్స్, డెలివరీ ఎగ్జిక్యూటివ్ అసోసియేట్స్, వేర్‌హౌస్ అసోసియేట్స్, ప్రింటింగ్ మిషన్ ఆపరేటర్, టీం లీడర్స్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ ఆపరేటర్ తదితర ఉద్యోగాలు భర్తీ చేస్తారు. ఆయా ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఐటీఐ, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించిన 18–45 ఏళ్ల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు https:// www. ncs. gov. in/ లో పేర్లు నమోదు చేసుకుని హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన

మహారాణిపేట (విశాఖ): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ బుధవారం ఉదయం 8.30 గంటలకు విశాఖ నుంచి అరకు బయలుదేరుతారు. అక్కడ ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొని రాత్రికి తిరిగి విశాఖ చేరుకుంటారు. 28న ఉదయం 8.30 గంటలకు అనంతగిరి, ఎస్.కోట, కొత్తవలస తదితర ప్రాంతాల్లో పర్యటనకు బయలుదేరుతారు. రాత్రికి తిరిగి విశాఖ చేరుకుంటారు. 29న స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

క్లుప్తంగా

4 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు


పోలీసులకు పట్టుబడిన గంజాయి స్మగ్లర్లు

కొయ్యూరు: నాలుగు కిలోల గంజాయితో పాటు ముగ్గురి నిందితులను అరెస్టు చేశామని మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ తెలిపారు. బూద రాళ్ల శివారున మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఒడిశాలోని సప్పర్లమెట్ట నుంచి తీసుకువస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. తమన చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నామన్నారు. కొత్తపేటకు చెందిన జనపాటి శివ, తలడం సత్యనారాయణమూర్తి, నిమ్మపాడుకు చెందిన గొల్లూరి కామేశ్వరరావులను అరెస్టు చేసి ద్విచక్ర వాహనాన్ని, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

పరుగుపోటీల్లో పాడేరు విద్యార్థి ప్రతిభ

- వెండి పతకం సాధించిన సింహాచలం నాయుడికి అభినందన

సాక్షి,పాడేరు: ఇటీవల గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో 100/200 మీటర్ల పరుగుపందెంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్.సింహాచలంనాయుడు ప్రతిభ కనబరిచాడు. ద్వితీయస్థానం సాధించి వెండి పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపల్ వనుము చిట్టిబ్బాయి, పీడీ ప్రసాద్‌నాయుడు అభినందించారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో అక్టోబర్ 13వ తేదీ నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు వారు పేర్కొన్నారు.

కారు బోల్తా


ప్రమాదానికి గురైన కారు

రంపచోడవరం: సీతపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వద్ద మంగళవారం ఓ కారు ఎంపీపీ పాఠశాల గోడ వద్ద బోల్తా పడింది. రంపచోడవరం వైపు నుంచి గోకవరం వైపు వెళుతున్న కారు వేగంగా రావడంతో రోడ్డు మలుపులో అదుపు తప్పింది. ఆ సమయంలో రోడ్డు పక్కన ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కారులో ఒక యువకుడు మాత్రమే ఉన్నాడు. ఈ ప్రమాదంలో అతనికి ఎటువంటి గాయాలు కాలేదు.

వేతనదారులకు పని కల్పించండి

కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి, పాడేరు: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో తొలగించిన జాబ్‌కార్డులను పునఃపరిశీలించి, తొలగింపు కారణాలతో సహా పూర్తి నివేదిక అందజేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఎంపీడీవోలను ఆదేశించారు. అదే విధంగా వేతనదారులకు పనికల్పించాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ గత మూడు సమావేశాల నుంచి చెబుతున్నప్పటికీ సరిగా స్పందించకపోవడం పట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో పనిచేస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. వచ్చేనెల 10వ తేదీలోగా నివేదికలు అందించాలని, పనితీరు మెరుగుపడకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త పనులకు అంచనాలు తయారు చేసి ప్రతిపాదిస్తే మంజూరు చేస్తామని చెప్పారు. పాఠశాల విద్యార్థుల డ్రాపౌట్స్ వివరాలు సమర్పించాలని మండల విద్యాశాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులు ఎంతమంది బడిబయట ఉన్నదీ వివరాలు తెలియజేయాలన్నారు. భవనాలు లేని పాఠశాలలు, విద్యావలంటీర్ల ఎక్కడ అవసరమో గుర్తించి వివరాలు అందజేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. డిజిటల్ తరగతుల పరికరాలను వెంటనే ఇన్‌స్టాల్ చేయాలన్నారు. లేట్‌బర్త్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఆమోదించిన జాబితాను ఆయా మండలాలకు పంపించినప్పటికీ సంబంధిత పంచాయతీ కార్యదర్శులు బర్త్‌సర్టిఫికెట్లను జారీ చేయడంలో తాత్సారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులను రేషన్‌లైజ్ చేయాల్సిందిగా డీపీవోను ఆదేశించారు. వారి హాజరును పర్యవేక్షించాలని డీఎల్డీవో శాంతకుమారిని ఆదేశించారు. ఈ సమావేశంలో డీబీటీ మేనేజర్ నరేష్, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా మేనేజర్ సునీల్ పాల్గొన్నారు.


మోదాపుట్టు ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

గిరిజన విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక ప్రత్యేక దృష్టి

గిరిజన విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తుపై ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. దిగుమోదాపుట్టు ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ముందుగా మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థుల సంక్షేమం, అమలుచేస్తున్న విద్యా కార్యక్రమాలు, పాఠశాలలో సమస్యలపై కలెక్టర్ సమీక్షించారు. కిచెన్ నిర్మాణంతో పాటు మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సమస్యలను పరిష్కరించాలని హెచ్‌ఎం, వార్డెన్‌లు కలెక్టర్‌ను కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఆయా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రన్నింగ్ వాటర్ పనులను వెంటనే చేపట్టి ఖర్చుల వివరాలతో బిల్లును ఏటీడబ్ల్యూవోకి అందజేయాలని, నగదు చెల్లిస్తామన్నారు.డైనింగ్ రూమ్,కిచెన్ షెడ్ నిర్మాణాలకు పంచాయతీరాజ్ ఏఈఈ ద్వారా అంచనాలు తనకు పంపాలని కలెక్టర్ తెలిపారు.

శరవేగంగా పునరుద్ధరణ పనులు

కేకే లైన్ పనులను పరిశీలించిన ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ

తాటిచెట్లపాలెం(విశాఖ): ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ మంగళవారం వాల్తేర్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ముందుగా కేకే లైన్లో ఇటీవల కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని ఆయన వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ప్రాంతంలో సుమారు 20కంటే ఎక్కువ అధిక సామర్థ్యం గల ఎర్త్‌మూవర్స్, ప్రొక్లెయినర్స్, ఇతర మెషినరీని వినియోగిస్తూ 400మంది కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారు. ఈ ప్రాంతంలో ట్రాక్‌లపై సుమారు 10వేల క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చి చేరిందని, ఇప్పటికే సుమారు 8వేల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగించినట్లు అధికారులు తెలిపారు. యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. వాతావరణం ప్రతికూలంగా ఉన్నా పనులు కొనసాగిస్తున్నట్లు డీఆర్‌ఎం వివరించారు. సంఘటన స్థలంలోనే ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్‌లకు చెందిన వివిధ విభాగాధిపతులతో, సీనియర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అక్కడ జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం విశాఖలోని ఆశీర్వాద్ కల్యాణమండపంలో జరుగుతున్న ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ వార్షిక జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్నారు. వడ్లపూడిలో గల వ్యాగన్ వర్క్‌షాప్‌ను సందర్శించారు.

బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ

సాక్షి,పాడేరు: విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌ల ద్వారా అందించే విద్యా కార్యక్రమాలపై హెచ్‌ఎంలు, టీచర్లకు తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. డీఈవో సలీమ్‌బాషా ఆదేశాల మేరకు అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల్లోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. జిల్లా నోడల్ అధికారి కామరాజు, రిసోర్స్‌పర్సన్ శివప్రసాద్ బైజూస్ కంటెంట్‌ను ఐఎఫ్‌పీ ద్వారా బోధించే విధానంపై సమగ్ర శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తలారిసింగి హెచ్‌ఎం రీమలిజాన్ తదితరులు పాల్గొన్నారు.


హెచ్‌ఎంలు, టీచర్లకు శిక్షణ ఇస్తున్న నోడల్ అధికారి కామరాజు, ఆర్‌పీ శివప్రసాద్‌లు

వారణాసి రైలుతో నెరవేరిన కల

బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు

ఎంవీపీకాలనీ: విశాఖ నుంచి వారణాసికి ప్రత్యేక రైలు ప్రకటనతో 15 ఏళ్ల విశాఖవాసుల కల నెరవేరిందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. వారణాసికి విశాఖ నుంచి ప్రత్యేక రైలు కావాలని పార్లమెంట్‌లో అడిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సానుకూల నిర్ణయం తీసుకుందన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బుధ, ఆదివారాల్లో విశాఖ నుంచి, మంగళవారం, శుక్రవారాల్లో వారణాసి నుంచి ఈ ట్రైన్ అందుబాటులో ఉంటుందన్నారు. దసరా నాటికే ఈ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. రానున్న రోజుల్లో డైలీ సర్వీసుగా ఈ ట్రైన్‌ను మార్పు చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. గ్రోత్ హబ్స్‌లో భాగంగా విశాఖ నగర అభివృద్ధిని బీజేపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశంలోని నాలుగు నగరాల్లో విశాఖ ఒకటిగా నిలిచిందన్నారు. ఈ జాబితాలో ముంబై, సూరత్, వారణాసితో పాటు విశాఖ నిలిచిందన్నారు. పీఎం గతిశక్తిలో భాగంగా పోర్టుకు 24/7 కనెక్టవిటీ, ఆక్వా ఉత్పత్తుల్లో 70 శాతం వాటా వంటి ఎన్నో ప్రాధాన్య అంశాలు విశాఖ పోర్టుకు లభించాయన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం కోర్టులో పెండింగ్‌లో ఉందన్న ఆయన కోర్టు నుంచి సముచిత నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు.

కేంద్ర ఉక్కు సహాయ మంత్రి పర్యటన రద్దు

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే స్టీల్‌ప్లాంట్ పర్యటన రద్దయింది. షెడ్యూల్ ప్రకారం ఆయన మంగళవారం విజయవాడ నుంచి సాయంత్రం 4.30 గంటలకు స్టీల్ ప్లాంట్ రావాల్సి ఉంది. కేంద్ర మంత్రి పర్యటనను అడ్డుకునేందుకు ఉక్కు పోరాట కమిటీ సిద్ధమైంది. నాయకులు ఆయా కార్మిక సంఘాల కార్యకర్తలను పెద్ద ఎత్తున హిల్ టాప్ కూడలికి రావాలని పిలుపు నిచ్చారు. ఇటీవల కేంద్ర ఉక్కు కార్యదర్శి నరేంద్రనాథ్ సిన్హా స్టీల్‌ప్లాంట్ పర్యటనలో జరిగిన రగడ నేపథ్యంలో పోలీసు అధికారులు, ఉక్కు యాజమాన్యంతో సుదీర్ఘంగా చర్చించారు. ఎట్టకేలకు కేంద్ర పర్యటన రద్దయినట్టు యాజమాన్య వర్గాలు ప్రకటించాయి.

హైకోర్టు న్యాయమూర్తి రాక నేడు

మహారాణిపేట: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకట రమణ బుధవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 6 గంటలకు తాడిపల్లి నుంచి రోడ్డు మార్గం ద్వారా విశాఖ బయలు దేరుతారు. మధ్యాహ్నం 12.10 గంటలకు విశాఖలోని ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 5 గంటలకు రుషికొండకు బయలుదేరి.. అక్కడ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. రాత్రి తిరిగి సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని బస చేస్తారు. 28న ఉదయం 7 గంటలకు సింహాచలం వెళతారు. అక్కడ స్వామి దర్శనం అనంతరం తిరిగి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు విజయవాడ బయలుదేరుతారు.

వెంకన్న ఉంగరం చోరీ!


స్వామివారి ఉంగరం దొంగతనంపై భక్తులను నిలదీస్తున్న అర్చకులు


స్వామి ధరించిన వస్త్రాల్లో ఉన్న ఉంగరాన్ని తీస్తున్న ప్రధానార్చకులు

- ఆలయానికి వచ్చిన భక్తులు, సిబ్బందిపై అనుమానం
- అర్చకులు నిలదీయడంతో భక్తుల్లో భయాందోళన
- అత్యంత వేడుకగా స్వామివారి వినోదోత్సవం

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది ఘనంగా జరుగుతున్నాయనుకున్న తరుణంలో చివరి రోజైన మంగళవారం కలకలం రేగింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపురోజు పసిడి అంగుళీయకం(బంగారు ఉంగరం) మాయం కావడంతో ఆలయ అధికారులు, భక్తులు తీవ్ర ఆందోళన చెందారు. మొదట ఆలయ అర్చకులు చేతివాటం ఉందని పలువురు భక్తులు అభిప్రాయపడగా, స్వామినే నమ్ముకుని సేవిస్తున్న తామెందుకు ఆ పని చేస్తామని అర్చకులు తెలిపారు. అయితే ఎక్కడనుంచో వచ్చి ఆలయంలో బాధ్యతలు నిర్వహిస్తున్న టీటీడీ ఉద్యోగి గురవయ్యపై అర్చకులు అనుమానం వ్యక్తం చేసి అతన్ని విచారించారు. దీంతో ఆయన హడలెత్తిపోయారు. పంతులు గారు ప్రసాదం పెడితే తింటాను తప్ప, దేవుడి ఉంగరం ఎందుకు దొంగిలిస్తానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో స్వామివారి ఉత్సవాలు తిలకించేందుకు వచ్చిన కొందరు భక్తుల కదలికలు అనుమానంగా ఉండటంతో వారిని సిబ్బంది నిలదీశారు. దీంతో భక్తులు కన్నీటి పర్యంతమయ్యారు. బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని దర్శించుకుంటే పుణ్యం వస్తుందన్న ఉద్దేశ్యంతో వస్తే దొంగతనం అంటగడతారా అంటూ భక్తులు ఆక్షేపించారు. ఈ లోగా ప్రధానార్చకులు గొట్టుముక్కల వచ్చి స్వామివారి ఉంగరం ఆయన ధరించిన వస్త్రాల్లోనే ఉందని చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఏటా స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉపమాక క్షేత్రంలో జరిగే వినోదోత్సవం గురించి తెలిసిన వారికి ఈ తంతు ఆద్యంతం అలరించింది. స్వామివారు మృగవేటకు వెళ్లిన సందర్భంలో అత్తవారిచ్చిన ఉంగరం పారేయడంతో అమ్మవారు స్వామివారిని నిలదీస్తారు. ఉంగరం తెస్తేనే గర్భాలయ ప్రవేశం ఉంటుందని అమ్మవార్లు చెప్పడంతో, ముసుగులో స్వామివారు ఉంగరం వెతికేందుకు వెళ్తారు. దీన్నే వినోదోత్సవంగా పేర్కొంటారు. అంతకు ముందు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, నిత్యార్చనలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు, వేణుగోపాల స్వామికి, అండాళమ్మవారికి పూజలు జరిపారు. గ్రామ బలిహరణలు, కంకణ విసర్జన కార్యక్రమాలు పూర్తిచేశారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లేనని ప్రధానార్చకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చక స్వాములు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకటశేషాచార్యులు, బాగవతం రాజగోపాలాచార్యులు, నండూరి గోపాలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అనంతుని జయంతి రేపు



పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవస్వామి ఆలయంలో ఈ నెల 28న అనంత పద్మనాభ స్వామి జయంతి జరగనుంది. ఇందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 4 గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలుపుతారు. 5 గంటలకు పంచామృతి అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం కుంతీ మాధవ స్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి భూమి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను వేద పండితులు వేదిక వద్దకు తీసుకువస్తారు. ఉదయం 6.30 గంటలకు, ఉదయం 10 గంటలకు రెండు విడతల్లో వ్రతాలు జరుగుతాయి. ఇప్పటికే శ్రీదేవి, భూదేవి, అనంతునికి సమర్పించే నూతన వస్త్రాలను సిద్ధం చేశారు. గిరి మెట్లకు భక్తుల సహాయంతో సున్నం వేసి అందంగా తీర్చిదిద్దారు.

ఢిల్లీలో జీ-20 యూనివర్సిటీ కనెక్ట్‌కు ఏయూ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన జీ-20 యూనివర్సిటీ కనెక్ట్ ఫినాలే కార్యక్రమంలో ఏయూ నుంచి 22 మంది విద్యార్థులతో కూడిన బృందం పాల్గొంది. ప్రగతి మైదానంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజు ఆధ్వర్యంలో వీరంతా భాగస్వాములయ్యారు. ఏయూ నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం పట్ల నిర్వాహకులు అభినందనలు తెలిపారు.


సదస్సులో పాల్గొన్న ఏయూ విద్యార్థులు

మత్స్య జాతుల మనోహరం

- 250 రకాలతో అలరారుతున్న మెరైన్ మ్యూజియం
- జనం ఎరుగని సముద్ర జాతులకు ఆలవాలం
- వాటిని పదిల పరిచే బాధ్యతను తీసుకున్న ఎఫ్ఎస్ఐ
- భావితరాలు, విద్యార్థులు, పరిశోధకులకు ఉపయుక్తం

సాక్షి, విశాఖపట్నం: ఆవులను చూశాం. గుర్రాలనూ చూశాం.. పాములనూ చూస్తున్నాం. కానీ సముద్రపు ఆవు.. సముద్రపు గుర్రం, సముద్ర పాములను ఎప్పుడైనా చూశారా? అయితే వాటి కోసం మీరు సముద్రంలోకి వెళ్లక్కర్లేదు. మన విశాఖ బీచ్ రోడ్డులో ఇలాంటి వాటిని చూడొచ్చు. ఫిషింగ్ హార్బర్ వద్ద ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) భవనంలో ఆధునీకరించిన మెరైన్ మ్యూజియంలో వీటితోపాటు జనం కంటపడని అత్యంత అరుదైన 250 మత్స్య జాతులు దర్శనమిస్తున్నాయి. అక్కడ గతంలో ఏర్పాటు చేసిన మెరైన్ మ్యూజియంను ఇటీవల ఆధునీకరించారు. ఈ మ్యూజియంను భావి తరాలు, విద్యార్థులు, పరిశోధకులతో పాటు సాధారణ ప్రజలు సందర్శించడానికి అనుమతించనున్నారు. ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్తలు పరిశోధనల్లో భాగంగా తమ నౌకల్లో సముద్రంలోకి వెళ్లినప్పుడు అరుదైన మత్స్య జాతులను తీసుకొస్తారు. వాటిలో ముఖ్యమైన వాటిని ఫార్మాలిన్, నీరు (1:4 నిష్పత్తి) కలిగిన మిశ్రమంలో గాజు సీసాల్లో భద్రపరుస్తారు. మరికొన్నింటిని లోపలున్న మాంసాన్ని తొలగించి దూదిని ఉంచి, పైన రసాయనంతో కూడిన పాలిష్‌ను పూస్తారు. ఇలాంటి వాటిని ఈ మెరైన్ మ్యూజియంలో ఉంచారు. వాటిలో కొన్ని అరుదైన మత్స్యజాతుల గురించి తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. వాటి తీరుతెన్నులను పరికిస్తే వింత గొలుపుతుంది! వాటిలో కొన్ని..



సముద్రపు ఆవు (సీ కౌ)

ఇవి తమిళనాడులోని గల్ఫ్ ఆఫ్ మన్నార్, గుజరాత్‌లోని గల్ఫ్ ఆఫ్ కచ్, అండమాన్ నికోబార్ దీవుల సముద్ర జలాల్లోనే ఉన్నాయి. ఇవి శాకాహారులు. సముద్రపు గడ్డిని, ఆల్గేను తింటాయి. క్షీరద జాతికి చెందిన ఇవి 2-7 ఏడేళ్లకోసారి సంతానోత్పత్తి చేస్తాయి. 2.5 మీటర్ల పొడవు, 230 నుంచి 400 కిలోల వరకు బరువు పెరుగుతాయి. వీటి జీవితకాలం 70 ఏళ్లు. ఇలాంటి భారత సముద్ర జలాల్లో 200 వరకు ఉన్నట్టు గుర్తించారు. ప్రస్తుతం విశాఖ మెరైన్ మ్యూజియంలో ఉన్న ఈ సీ కౌ తమిళనాడులోని ట్యుటికోరిన్ మ్యూజియంలో ఉండేది. ఆ మ్యూజియాన్ని మూసివేయడంతో దానిని 1985లో అక్కడ నుంచి ఇక్కడకు తెచ్చారు.

సముద్రపు గుర్రం (సీ హార్స్)

సీ హార్స్. దీనినే సముద్రపు గుర్రంగా పిలుస్తారు. చూడటానికి గుర్రపు ఆకారంలో ఉంటూ సముద్రంలోనే జీవిస్తుంది. రొయ్య సైజులో ఉంటుంది. వీటిని తినడానికి ఎవరూ ఇష్టపడరు. ఇవి తూర్పు తీరంలోను, అండమాన్ సముద్రంలోనూ ఉంటాయి. వీటికంటే ఆస్ట్రేలియా సముద్ర జలాల్లో పెరిగేవి ఇంకా తెలుపు రంగులో ఉంటాయి. వీటిని అంతరించిపోతున్న జాతుల్లో ఒకటిగా గుర్తించారు.



సీ యాపిల్



ఇవి చూడటానికి యాపిల్ పండ్లను పోలి ఉంటాయి. అందుకే వీటిని సీ యాపిల్‌గా పిలుస్తారు. వీటి ఉనికి కళింగపట్నం, ఒడిశా తీరంలోని సముద్రంలో రాత్రి ప్రదేశాల్లో సంచరిస్తాయి.. వీటిలో ఔషధ గుణాలుండడం వల్ల డిమాండ్ అధికం.

కింగ్ క్రాబ్



కింగ్ క్రాబ్.. పీత జాతికి చెందిన ఇవి పీత ఆకారం లోనే భిన్నంగా ఉంటాయి. వీటి ప్రత్యేకత ఏమిటంటే.. నాలుగు వేల సంవత్సరాలుగా ఇవి రూపు రేఖలు మార్చుకోకుండా జీవిస్తున్నాయి. వీటి రక్తం నీలం రంగులో ఉంటుంది. ఈ రక్తాన్ని ఔషధాల్లో వినియోగిస్తుంటారు. ఈ కింగ్ క్రాబ్ ఒడిశా, పశ్చిమబెంగాల్ సముద్ర జల్లాలో అరుదుగా కనిపిస్తుంటాయి. ఈ మ్యూజియంలో ఉంచిన కింగ్ క్రాబ్ ఒడిశాలోని పారాదీప్ తీరంలో ఎఫ్ఎస్ఐ వెసల్ శాస్త్రవేత్తలకు చిక్కింది.

సముద్రపు పాము (సీ స్నేక్)



సీ స్నేక్‌లు తూర్పు, పశ్చిమ తీరాల్లోనూ ఉనికిలో ఉన్నాయి. ఇవి సముద్రం అడుగున 40-60 మీటర్ల లోతులో ఉంటాయి. మామూలు సర్పాలకంటే పది రెట్ల అధిక విషాన్ని కలిగి ఉంటాయి. ఇవి మనుషుల్ని కాటేస్తే బతికి బట్టకట్టడం అసాధ్యం. రెండు మీటర్ల పొడవుంటాయి. ప్రస్తుతం ఈ మ్యూజియంలో ఉంచిన ఈ సీ స్నేక్ భీమిలి తీరంలో 2018లో ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్తలకు పట్టుబడింది.

త్వరలో సందర్శకులకు అనుమతి


సికిల్ ఫిష్

ఈ మెరైన్ మ్యూజియంలోకి త్వరలో సందర్శకులను అనుమతించనున్నారు. విద్యార్థులు, స్కాలర్లతో పాటు సాధారణ ప్రజానీకానికి ముందస్తు అనుమతితో ప్రవేశానికి వీలు కల్పిస్తారు. అరుదైన, అంతరించి పోతున్న సముద్ర జాతుల విశిష్టతను తెలుసుకునేందుకు ఈ మ్యూజియం దోహదపడుతుందని ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్త గుమ్మడి వెంకట అంకినీడు ప్రసాద్ 'సాక్షి'కి తెలిపారు.